క్లుప్తంగా

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

• కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(దర్గామిట్ట) : రాబోయే 48 గంటలు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఆర్డీఓలు, జిల్లా అధికారులతో టెలీ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. మండల, గ్రామస్థాయి అధికారులు తప్పనిసరిగా వారి హెడ్‌క్వార్టర్స్‌లోనే ఉండాలన్నారు. వాతావరణశాఖ సూచనల ప్రకారం మరో రెండు రోజులు భారీ వర్షాలు, గాలులు వీచే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాల ప్రజల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ముంపునకు గురయ్యే ప్రాంతాలు ఉంటే అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. గాలులకు పడిపోయే అవకాశం ఉన్న హోర్డింగ్‌లను తొలగించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

బయటకు రావద్దు

• మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



నెల్లూరు(బారకాసు) : తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా ప్రజలు అజాగ్రత్తగా ఉండకుండా అప్రమత్తంగా ఉండాలని వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ పరిశీలకుడు, మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. అవసరమైతే తప్ప ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలు బయటకు రావద్దన్నారు. ముఖ్యంగా చెట్ల కింద, కరెంటు స్తంభాల కింద ఉండకుండా ఇంట్లోనే సురక్షితంగా ఉంటూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

అప్రమత్తతే ముఖ్యం

• ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి



నెల్లూరు(బారకాసు) : భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తతే ముఖ్యమని నగర ప్రజలకు వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలను అప్రమత్తం చేసి తుఫాన్ వల్ల వారికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా సహాయక చర్యలు చేపట్టాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణులు అందుబాటులో ఉండండి

• ఆనం విజయకుమార్‌రెడ్డి



నెల్లూరు సిటీ : జిల్లాకు తుఫాన్ హెచ్చరిక ఉన్న నేపథ్యంలో రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండాలని వైఎస్సార్‌సీపీ రూరల్ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలకు ఏమైనా ఇబ్బందులు ఏర్పడితే మీరందరూ అందుబాటులో ఉండి, సహాయక చర్యల్లో పాల్గొనాలని కోరారు.

గ్రామాల్లో దసరా ఉత్సవాలు



మనుబోలు: చాముండేశ్వరీదేవి అలంకారంలో..

మనుబోలు: దసరా ఉత్సవాల్లో భాగంగా మనుబోలు దసరా చావిడి, కోదండరామపురం, పోలేరమ్మ ఆలయాల వద్ద కార్యక్రమాలు జరిగాయి. సోమవారం చివరి రోజు కావడంతో పెద్దఎత్తున సందడి నెలకొంది. విద్యుత్ దీపాలతో రూపొందించిన దేవతామూర్తుల ఆర్చిలు ఆకట్టుకుంటున్నాయి. అలాగే కేఆర్‌పురం సెంటర్‌లో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు.

• మనుబోలు పోలేరమ్మ ఆలయంలో అమ్మవారు సోమవారం చాముండేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకుడు శ్రీనివాసులు శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం చేశారు. మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఉభయకర్తలుగా విజ్జగిరి వెంకట్రావు, పుష్ప దంపతులు వ్యవహరించారు.

• పొదలకూరు: దసరా ఉత్సవాల్లో భాగంగా సోమవారం చివరిరోజున శ్రీకన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు శయ్య అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఊంజల సేవ నిర్వహించారు. తన్నీరు బాలకష్ణయ్య జ్ఞాపకార్థం వారి కుమారుడు ఉభయకర్తగా వ్యవహరించారు.



అమ్మవారు



వీఆర్సీ సెంటర్ వద్ద..



కేవీఆర్ సెంటర్‌లో..



నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద కురుస్తున్న భారీ వర్షం

కుండపోత వర్షం

• రోడ్లు జలమయం.. వాహనదారుల పాట్లు
• పలు వీధులు, కాలనీల్లో నిలిచిన నీరు
• అండర్ బ్రిడ్జిల్లోకి చేరుతున్న వర్షపునీరు
• రాకపోకలకు ఇబ్బందులు

నెల్లూరు(బారకాసు) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా నెల్లూరు నగరంలో సోమవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరపి లేకుండా కుండపోత వర్షం కురిసింది. దీంతో ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. నీటి ప్రవాహానికి వాహనదారులు, పాదచారులు అనేక పాట్లు పడాల్సి వచ్చింది. నగరంలోని పలు ప్రాంతాల్లో వీధులు, కాలనీల్లో వర్షపు నీరు నిల్వ చేరింది. అంతేకాకుండా నగరంలోని విజయమహల్‌గేట్ అండర్ బ్రిడ్జి, రామలింగాపురం, మాగుంట లేఅవుట్ అండ్ బ్రిడ్జిలలో నీరు నిల్వ చేరడంతో వాహనాలు కష్టతరంగా ముందుకెళ్లాయి. ఎన్‌ఎంసీ సిబ్బంది ప్రత్యేక మోటార్ల ద్వారా నీటిని తొలగించే చర్యలు చేపడుతున్నారు. నగర శివారు ప్రాంతాల్లో నీరు నిల్వ చేరడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.

వాహనదారులకు ఇక్కట్లు

వర్ష ప్రభావం కారణంగా నెల్లూరు నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో ఉన్న గుంతల్లో నీరు నిలిచిపోయింది. దీంతో ఎక్కడ గుంతలు ఉన్నాయో తెలియక వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ప్రధానంగా ద్విచక్రవాహనదారులు ఆయా గుంతల వల్ల ప్రమాదాల బారిన పడుతున్నారు.



గాంధీ బొమ్మ సెంటర్‌లో పొంగిపొర్లుతున్న కాలువ నీరు

పొంగిపొర్లుతున్న మురుగు

జోరువానకు నగరంలోని డ్రెయిన్లు, మ్యాన్‌హోల్స్, మురుగు కాలువలు పొంగి పొర్లుతున్నాయి. దీంతో మురుగునీరు రోడ్లపై ప్రవహించడంతో రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు, పాదచారులు అసౌకర్యానికి గురయ్యారు. ట్రంకు రోడ్డులోని సండేమార్కెట్ ప్రాంతంలో మురుగు నీరు ప్రవహించడంతో ప్రజలు అనేక అవస్థలు పడ్డారు. అదేవిధంగా పొగతోట, మూడుహోళ్లవీధి, ట్రంకురోడ్డు, స్టోన్‌హౌస్‌పేట, పెద్దబజార్, చిన్నబజార్, ఆచారివీధి, లీలామహల్‌రోడ్డు, మద్రాసు బస్టాండ్, ఆర్టీసీ, ఫత్తేఖాన్‌పేట, ఎన్‌జీఓ కాలనీ, దర్గామిట్ట, రామలింగాపురం, రామ్మూర్తినగర్, బాలాజీనగర్, నవాబుపేట, జనార్దన్‌రెడ్డికాలనీ, భగత్‌సింగ్ కాలనీ, మెక్లిన్స్‌రోడ్డు తదితర ప్రాంతాల్లోని రోడ్లలో వర్షపు నీరు నిల్వ చేరడంతో పాటు డ్రెయిన్లు నిండి వాటి మురుగు నీరు రోడ్డుపైకి పొంగి ప్రవహిస్తోంది.

సహాయక చర్యల్లో ఎన్‌ఎంసీ

నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని లోతట్టు, శివారు ప్రాంతాలైన కల్లూరుపల్లి, హౌసింగ్‌బోర్డు కాలనీ, బుజబుజనెల్లూరు, వైఎస్సార్‌నగర్, ఆర్టీసీ కాలనీ, చంద్రబాబునగర్, టైలర్స్‌కాలనీ, కనుపర్తిపాడు తదితర ప్రాంతాలన్నీ జలమయ్యే పరిస్థితి నెలకొంది. ఆయా ప్రాంతాల ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఉండేలా నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ప్రణాళికాబద్ధంగా తగిన చర్యలు చేపడుతున్నారు. జేసీబీల సహాయంతో శివారు ప్రాంతాల్లోని మురుగు కాలువలు, పెద్ద కాలువలు, పంట కాలువల్లో నెలకొన్న వ్యర్థాలు, అడ్డంకులను తొలగించి నీటి ప్రవాహం సక్రమంగా ప్రవహించేలా చేశారు.

యుద్ధ ప్రాతిపదికన చర్యలు

• కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(బారకాసు) : నగరంలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రధాన రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా ప్రత్యేక బృందాల ద్వారా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామని ఎన్‌ఎంసీ కమిషనర్ సూర్యతేజ అన్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఆయన సోమవారం పర్యటించి వరద నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న దుకాణాల మెట్లు, ర్యాంపులు, ఇతర చిన్న చిన్న నిర్మాణాలను జేసీబీ యంత్రాల సహాయంతో తొలగింపు చర్యలు చేపట్టారు. వర్షపు నీటి ప్రవాహానికి అంతరాయం లేకుండా అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తూ పర్యవేక్షిస్తున్నామని, వాహనదారులు ఇబ్బందుల్లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ వెల్లడించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాలధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఇంజినీరింగ్ అధికారులకు సూచనలు చేస్తున్న కమిషనర్ సూర్యతేజ



సండే మార్కెట్‌లో మోకాళ్లలోతు నీటిలో వెళ్తున్న వాహనాలు



భారీ వర్షంలో వెళ్తున్న మహిళ



పొగతోటలో ఇళ్ల మధ్య పారుతున్న డ్రెయినేజీ వాటర్



పొగతోటలో ఇళ్లలోకి వెళ్తున్న వర్షపునీరు



ఆత్మకూరు బస్టాండ్ వద్ద డ్రెయినేజీ నుంచి వస్తున్న మురుగునీరు

నగరంలో 13 పునరావాస కేంద్రాలు



సిబ్బందితో మాట్లాడుతున్న మేయర్ స్రవంతి

నెల్లూరు(బారకాసు) : నగర వ్యాప్తంగా 13 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని, లోతట్టు ప్రాంతాల ప్రజలను తరలించేందుకు సంసిద్ధంగా ఉన్నామని మేయర్ పోట్లూరి స్రవంతి తెలిపారు. ఎన్‌ఎంసీ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా అందుతున్న సహాయక చర్యలను మేయర్ సోమవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ విభాగం ద్వారా బాధితులకు సత్వర స్పందన అందించి అవసరమైన సహాయ సహకారాలను అందించనున్నామని తెలియజేశారు. జేసీబీల సహాయంతో డ్రెయిను కాలువల్లో పూడికతీత పనులను 24 గంటల పాటు నిర్వహిస్తూ, వర్ష ప్రభావం తగ్గేంత వరకు పనులు జరిగేలా పర్యవేక్షించనున్నామని చెప్పారు. లోతట్టు ప్రాంతాల వారు వర్షాల నేపథ్యంలో స్థానికంగా సమస్యలు ఏర్పడితే 0861-2356777, 0861-2316777 నంబర్లకు సమాచారం అందించి తగిన సహాయం పొందాలని సూచించారు. అవసరమైన ప్రాంతాలకు తాగునీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కోరారు. అనంతరం హెల్ప్‌లైన్‌కు వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి వెంటనే తగిన సహాయక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

జూదరుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్) : నెల్లూరు కిసాన్‌నగర్‌లోని ఓ ఇంట్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఆదివారం అర్ధరాత్రి నవాబుపేట ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా దాడిచేశారు. పేకాట ఆడుతున్న అజారుద్దీన్, షబ్బీర్, కొండయ్య, కృష్ణయ్య, తులసీదాస్, శ్రీనివాసులురెడ్డి, దొరస్వామి, నరసింహలను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.89,500 నగదును స్వాధీనం చేసుకున్నారు.

నిత్యావసర సరుకుల వితరణ



నెల్లూరు సిటీ : అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఓ కుటుంబానికి రెండు నెలల నిత్యావసర సరుకులను అందజేసినట్లు పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు కోగలి రమేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీలంక కాలనీకి చెందిన సందియాగు విన్సెంట్ గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో ఉన్నారని, ఆర్థికంగా కూడా ఇబ్బందులు పడుతుండడంతో సరుకులను అందజేశామన్నారు.

కూలిన విద్యుత్ స్తంభం, తెగిన లైన్



చాణుక్యపురిలో విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది



నేలకొరిగిన విద్యుత్ స్తంభం

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : జిల్లాలో కురుస్తున్న వర్షాలకు పలుచోట్ల విద్యుత్ స్తంభాలు, విద్యుత్ లైన్లు తెగిపోవడంతో పాటు, పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయాలు ఏర్పడ్డాయి. అయితే విద్యుత్ అధికారులు, సిబ్బంది యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి సకాలంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. నగరంలోని శాంతినగర్ చాణుక్యపురి వద్ద 11 కేవీ విద్యుత్ లైన్ తెగిపోవడంతో సిబ్బంది వేగంగా సరిచేశారు. అదేవిధంగా గాంధీనగర్‌లో ఉన్న మహిళా ప్రాంగణంలో విద్యుత్ స్తంభం నేలకొరిగింది. దీంతో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అశోక్ సిబ్బందిని అప్రమత్తం చేసి వెంటనే నూతన స్తంభాన్ని ఏర్పాటు చేశారు. ఇందుకూరుపేటలోని రాముడుపాళెం సబ్‌స్టేషన్‌లోకి వర్షపు నీరు చేరింది.



రాముడుపాళెం సబ్‌స్టేషన్‌లోకి చేరిన వర్షపునీరు

తిక్కన విజ్ఞాన కేంద్రం ప్రారంభం



నెల్లూరు(బృందావనం) : నేతాజీనగర్ ఐదో వీధిలో కవి పెరుగు రామకృష్ణ స్వగృహంలో మహాకవి తిక్కన విజ్ఞాన కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. తిక్కన వారసులు తలుపూరు వెంకటరామకృష్ణ చేతుల మీదుగా తిక్కన చిత్రపటాన్ని ఆవిష్కరించారు. ఆధునిక సాహిత్య గ్రంథాలతో తిక్కన విజ్ఞాన కేంద్రం విరాజిల్లుతుందని వ్యవస్థాపకుడు రామకృష్ణ తెలిపారు.

మధు గ్యాస్ట్రో హాస్పిటల్ ప్రారంభం

నెల్లూరు(అర్బన్) : స్థానిక విజయమహల్ గేట్ పక్కనే మధు గ్యాస్ట్రో హాస్పిటల్‌ను ప్రారంభించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య హాస్పిటల్‌ను ప్రారంభించి, మాట్లాడారు. తక్కువ ఖర్చుతో పేదలకు వైద్యం అందించాలని సూచించారు. ఆస్పత్రి అధినేత డాక్టర్ మధు మాట్లాడుతూ పొగతోటలోని ఆకాష్ ఆస్పత్రిలో తనతో పాటు డాక్టర్ రేణుకాదేవి గత 15 ఏళ్లుగా జనరల్ ఫిజిషియన్‌లుగా సేవలందించామన్నారు. ఇప్పుడు సొంత భవనంలో ఆస్పత్రిని ఏర్పాటు చేశామన్నారు. తన స్వగ్రామం మురగళ్ల వాసులకు ఏడాది రోజుల పాటు 50 శాతం రాయితీతో ఓపీ సేవలు, పాత పేషెంట్లకు ఒక నెల వరకు 50 శాతం రాయితీతో వైద్యసేవలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఐపీఎస్ అధికారి పూర్ణచంద్రరావు, ఐఎంఏ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ అశోక్‌కుమార్, డాక్టర్ రజనీకాంత్, న్యూరాలజిస్ట్ డాక్టర్ నీరజ పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తాం

నెల్లూరు(బారకాసు) : జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టులకు త్వరలోనే ఇళ్ల స్థలాలు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ హామీ ఇచ్చారు. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మంత్రి నారాయణను సోమవారం పలువురు జర్నలిస్టులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే స్థల సేకరణపై అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటానని హామీ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం: మోటార్‌బైక్ అదుపుతప్పి ఇద్దరు వ్యక్తులు గాయపడిన ఘటన మండలంలోని పుంజులూరుపాడు సమీపంలో సోమవారం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. పొదలకూరుకు చెందిన అశోక్, సురేష్ పని నిమిత్తం బైక్‌పై ముత్తుకూరుకు వెళ్లారు. తిరిగి పొదలకూరుకు బయలుదేరారు. ఈ క్రమంలో పుంజులూరుపాడు సమీపంలో కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై బైక్ అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో అశోక్, సురేష్ గాయపడగా చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు కాకాణి నివాళి

పొదలకూరు: మండలంలోని తోడేరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఒంటేరు ధన్‌రాజ్ (33) సోమవారం మృతిచెందాడు. ధన్‌రాజ్ రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో ఇంటి వద్ద మృతిచెందడంతో సమాచారం అందుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తోడేరుకు చేరుకుని ధన్‌రాజ్ మృతదేహానికి పూలమాలలు వేసి వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు సోదర సమానుడైన ధన్‌రాజ్ మృతిచెందడం తీరని లోటుగా పేర్కొన్నారు.